# మూల్యాంకన విధానాలు

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా పాఠశాలలో నిర్వహించే మూల్యాంకన విధానాలు పిల్లలను సంపూర్ణంగా పరిశీలించి నమోదుచేసేవిగా ఉండాలి. ఉపాధ్యాయులు తరగతిగది లోపల బయట పిల్లలను పరిశీలిస్తూ చేసే అంశాలతోపాటు క్రమానుగతంగా నిర్ణీత కాలవ్యవధులలో నిర్వహించే మూల్యాంకనం కూడా అవసరమే. ఇవి వారాంత, పక్ష, మాస, టర్మినల్ రూపాలలో కూడా ఉండడం అవసరం. అయితే ఏ మూల్యాంకన విధానం అయినప్పటికి వచ్చే ఫలితాలను బట్టి ఏ ఇద్దరినీ ఒకరితో ఒకరిని పోల్చకూడదు. అంటే మూల్యాంకనం పిల్లలు ఎలా నేర్చుకున్నారు? ఏమి నేర్చుకున్నారు? అనే అంశాలు పరిశీలించడంతోపాటు నేర్చుకున్న అంశం స్థిరంగా ఉండేందుకు కూడా మూల్యాంకనం తోడ్పడాలి. జ్ఞానము, అవగాహన వినియోగం, విశ్లేషణ, నూతన సందర్భాలలో సర్దుబాటు చేసుకోవడమనే అంశాలతోబాటు అభిరుచులు, వైఖరులు, ఉద్వేగాలు, ప్రత్యేక ఆసక్తులు, శారీరక ఎదుగుదల ఆరోగ్యకరమైన విషయాలుకూడా నిశితంగా మూల్యాంకనం చేయాలి. ఈ విధమైన మూల్యాంకనం రెండు రకాలు.

1. నిర్మాణాత్మక మూల్యాంకనం (ఫార్మాటివ్ ఎవాల్యుయేషన్)
2. సంగ్రహణాత్మక మూల్యాంకనం (సమ్మేటివ్ ఎవాల్యుయేషన్)

**నిర్మాణాత్మక మూల్యాంకనం (ఫార్మాటివ్ అసెస్‌మెంట్):**

తరగతి గదిలో కల్పించిన అభ్యసన కృత్యాలలో పిల్లలు పాల్గొంటున్నప్పుడు, బోధన జరుగుతున్నప్పుడు విద్యార్థి ఏ విధంగా నేర్చుకుంటున్నాడో పరిశీలించి నమోదు చేయడం ద్వారా పిల్లల అభ్యసనాన్ని మెరుగుపరచడానికి కృషిచేయడాన్ని నిర్మాణాత్మక మూల్యాంకనం అంటారు. నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది భయరహిత వాతావరణంలో, పిల్లలకు ఆసరాగా నిలిచి అభ్యసనను వేగవంతం చేసుకోడానికి ఉపకరించేది. ఉపాధ్యాయుడు పిల్లల ప్రగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సందర్భాలలో ఉపాధ్యాయుడు పిల్లలకు సహాయకారిగా నిలిచి సరిదిద్ది ముందుకు నడిపించాలి. కేవలం మార్కులు, గ్రేడులు రూపంలో కాకుండా పిల్లలకు వారి సామర్థ్యాల సాధనా స్థితిగతులను వివరణాత్మకంగా తెలిపి వారికి సరైన సూచనలు సలహాలు ఇచ్చి ప్రోత్సహించి అభ్యసనాన్ని మెరుగుపరచడానికి నిర్మాణాత్మక మూల్యాంకనం సహాయపడుతుంది.

తరగతి గదిలో జరిగే చర్చలు, పిల్లల సమాధానాలు, పాఠం మధ్యలో మరియు చివర ఉన్న ప్రశ్నలు, అభ్యాసాల గురించి చర్చిస్తున్నప్పుడు పిల్లలు ఇచ్చే సమాధానాలు, పిల్లలు రాసిన నోటుపుస్తకాలు, తరగతి పని, ఇంటిపని, ప్రాజెక్టుపనులు, జట్టు పనులు మొదలైన వాటి ఆధారంగా పిల్లలు ఏమి నేర్చుకున్నారో, ఎలా నేర్చుకుంటున్నారనేది ఉపాధ్యాయుడు అంచనా వేయవచ్చు. దీనినే నిర్మాణాత్మక మూల్యాంకనం అంటాం.

బోధనాభ్యసన జరుగుతున్న సమయంలో నిరంతరం ఫీడ్‌బ్యాక్ ఇస్తూ ఉపాధ్యాయునికి, విద్యార్థికి తమను తాము సరిచేసుకునే వీలుకల్పిస్తుంది. అవసరమైన మార్పులు చేసుకోవడానికి తోడ్పడుతుంది.

# మూల్యాంకన సాధనాలు - వివరణ

నిరంతర సమగ్ర మూల్యాంకనం ద్వారా పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుడు పరిశీలించాలి. తరగతిగదిలో, బయట జరిగే బోధనాభ్యసన ప్రక్రియలన్నింటిని పరిగణనలోకి తీసుకొని పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేయాలి. ఇందుకోసం ఉపాధ్యాయునికి వివిధ రకాలైన మూల్యాంకనం సాధనాలు అవసరమవుతాయి. ప్రధానంగా నిర్మాణాత్మక మూల్యాంకనంలో ఉపాధ్యాయుడు చెక్‌లిస్ట్‌లు, పిల్లల నోట్ పుస్తకాలు, పిల్లల డైరీలు, రేటింగ్ స్కేలు, పోర్టుఫోలియోలు, అనెక్డోట్‌లు, వ్యక్తిగత పరిశీలనలు, ఉపాధ్యాయుని డైరీలు మొదలైన సాధనాల ద్వారా మూల్యాంకనం చేయాలి. సంగ్రహణాత్మక మూల్యాంకనంలో కూడా మౌఖిక పరీక్షలు, రాతపరీక్షలు వంటి సాధనాలు అవసరమవుతాయి. వాటిని గురించి వివరంగా తెలుసుకుందాం.

**నిర్మాణాత్మక మూల్యాంకన సాధనాలు**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రధానంగా నాలుగు రకాల సాధనాలను ఉపయోగించాలి.

1. పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు
2. రాత అంశాలు (నోటుపుస్తకాలు, ఇంటిపని మొ॥వి)
3. ప్రాజెక్టు పనులు
4. లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్)

**1. పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు**

పాఠశాలలో కల్పించే బోధనాభ్యసన సన్నివేశాలలో పిల్లలు పాల్గొనే విధానం, వారు నేర్చుకునే క్రమాన్ని, ప్రగతిని తెలియజేస్తుంది. కాబట్టి ఉపాధ్యాయుడు వివిధ బోధనాభ్యసన ప్రక్రియల్లో పిల్లలు ఎలా పాల్గొంటున్నారో? ఎలా ప్రతిస్పందిస్తున్నారో? పరిశీలించడం ద్వారా పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేయడానికి వీలు కలుగుతుంది. అభ్యసన ప్రక్రియలలో పిల్లల భాగస్వామ్యాన్ని ప్రతిస్పందనలను వివిధ అభ్యసన సన్నివేశాల ద్వారా పరిశీలించవచ్చు.

- పాఠ్యాంశంపై జరిగే చర్చలలో
- కృత్యాలు, జట్టుపనులు చేస్తున్నపుడు
- ప్రాజెక్టు పనులలో పాల్గొన్నపుడు
- నమూనాలు, మాదిరులు, పటాలు, గ్రాఫ్‌లు రూపొందిస్తున్నపుడు
- సృజనాత్మక కృత్యాలలో పాల్గొంటున్నపు
- మైండ్‌మాపింగ్‌పై జరిగే చర్చల్లో పాల్గొన్నపుడు
- పాఠం మధ్యలోని, పాఠం చివర ఉన్న ప్రశ్నలకు సమాధానాలను గురించి చర్చిస్తున్నపుడు.

ఉపాధ్యాయుడు తరగతి గదిలో, తరగతిగది బయట పిల్లలను పరిశీలించాలి. తరగతిగదిలో ఉపాధ్యాయుడు చెప్పే పాఠం వింటున్నది, లేనిది, పిల్లలు పరస్పర చర్చల (participation, discussion) లో పాల్గొంటున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి పరిశీలన అనేది ఒక సాధనంగా ఉపయోగపడుతుంది.

తరగతిగది బయట పిల్లల క్రమశిక్షణ, ప్రవర్తన, వివిధ అంశాలకు ప్రతిస్పందన, చిత్రాలు గీయటం, పాటలు పాడటం, ఆటలు ఆడటం, ఆహారపుటలవాట్లు, ఆరోగ్యపు అలవాట్లు, వ్యక్తిగత పరిసరముల పరిశుభ్రత, విచక్షణా పరిజ్ఞానం మొదలైన విషయాలలో పిల్లలను పరిశీలించడం ద్వారా మదింపు చేయవచ్చు. మరియు పరిశీలనల ఆధారంగా వివిధ సామర్థ్యాలలో ఎలా ఉన్నాడో అంచనా వేయవచ్చు. వీరికి సలహాలు ఇచ్చి ఇంకా మెరుగుపరుకునేటట్లు తప్పులు సరిదిద్దుకునేటట్లు చేయవచ్చు.దీనికోసం తరగతిగది లోపల, తరగతిగది బయట ఎల్లప్పుడూ ఉపాధ్యాయుడు, విద్యార్థిని పరిశీలిస్తూ ఉండాలి.

### మౌఖిక పరీక్ష (Oral Test)

తరగతిగదిలో పిల్లలు అభ్యసన సన్నివేశాల ద్వారా నేర్చుకుంటున్న అంశాలను గురించి పరిశీలించడానికి మౌఖిక పరీక్షను ఉపాధ్యాయుడు ఒక సాధనంగా ఉపయోగించవచ్చు. ప్రతిరోజూ తరగతిగదిలో పాఠం చెబుత్ను సందర్భంలో విద్యార్థికి ఎంతవరకు అర్థమయిందో తెలుసుకోవడానికిఉపాధ్యాయుడు రకరకాల ప్రశ్నలు వేస్తూ తెలుసుకుంటూ ఉంటాడు. దీనిని కూడా మౌఖిక పరీక్షగా గ్రహించవచ్చు. వినడం/ మాట్లాడడం అనే సామర్థ్యాన్ని పరీక్షించడానికి వివిధ సందర్భాలలో రకరకాల కృత్యాలు నిర్వహిస్తుంటాం. అలాగే 'గణితంలో' మనోగణితానికి (నోటిలెక్కలు) చెందిన అంశాన్ని ఉపాధ్యాయుడు రకరకాలుగా ప్రశ్నించి తెలుసుకొంటూ ఉ ంటారు. ఇలా రాతపూర్వకంగా కాకుండా 'అడిగే' రూపంలో ప్రశ్నించే విధానాన్ని మౌఖిక పరీక్షగా చెప్పుకోవచ్చు. ఇది ఒక నిర్దుష్టమైన సమయానికి చెందినది కాక నిరంతరంగా, సమగ్రంగానూ కొనసాగే పరీక్షగా గుర్తించాలి.

### టీచర్ డైరీ

పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలలో పిల్లల ప్రగతిని, పాల్గొంటున్న విధానాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేసుకోవడానికి టీచర్‌డైరీ ఉపాధ్యాయునికి ఎంతగానో ఉపయోగపడుతుంది. బోధన జరుగుతున్నప్పుడు, బోధనానంతరం విద్యార్థుల ప్రతిస్పందనలను, కొందరి విశేష ప్రతిభను, లేదా అవగాహనా లోపాలను నమోదు చేయడానికి, ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడానికి ఉపాధ్యాయునికి ఉపయోగపడుతుంది. కనుక టీచర్‌డైరీ పిల్లల సామర్థ్యాలను మదింపు చేసి నమోదుచేసుకోడానికి ఉపాధ్యాయునికి రోజువారీ ఉపయోగపడే సాధనంగా భావించాలి.

## 2. పిల్లలు రాసిన అంశాలు

పిల్లలు తాము నేర్చుకున్న అంశాలపై తమ అభిప్రాయాలను జోడిస్తూ సొంతంగా రాస్తారు. ఇవి పిల్లలు సాధించిన సామర్థ్యాల గురించి అర్థం చేసుకోవడానికి సాధనాలుగా ఉపయోగపడతాయి. తరగతిగదిలోనూ, ఇంటి దగ్గర పిల్లలు అనేక అంశాలను రాస్తారు. వీటన్నింటిని నిర్మాణాత్మక మూల్యాంకనంలో పరిగణనలోకి తీసుకోవాలి. పిల్లలు తరగతి గదిలో వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన అనేక విషయాలను నోటుపుస్తకాలలో, ఇంటిపని పుస్తకాలలో, పాఠ్యపుస్తకాలలో రాస్తూ ఉంటారు. వీటన్నింటినీ పరిశీలించినప్పుడు పిల్లలు ఎలా నేర్చుకొంటున్నారు? ఎక్కడెక్కడ తప్పులు చేస్తున్నారు? పరిశీలించి సొంతంగా రాయడానికి తగిన సహకారం అందించడానికి వీలుకలుగుతుంది.

**(అ) నోటు పుస్తకాలు:**

పిల్లలు పాఠశాలలోనూ, ఇంటివద్ద తమ నోటు పుస్తకాలో రాసిన జవాబులు, చేసిన లెక్కలు మొదలైన వాటిని పరిశీలించి విద్యార్థి ప్రగతిని తెలుసుకోవాలి. ఏ విషయంలో ఎంత వెనుకబడి ఉన్నాడనేది తెలుసుకోవడం ద్వారా విద్యార్థికి అనువైన బోధనాభ్యసనను అందించడానికి వీలుకలగుతుంది. పిల్లలందరినీ నోట్‌పుస్తకములు తెచ్చుకోవడానికి ప్రోత్సహించాలి. పిల్లల నోట్ పుస్తకంలో పాఠ్యాంశాలకు సంబంధించిన అంశములు, ప్రశ్నలు, జవాబులు, వివిధ అంశములలో వారికి నచ్చిన అంశములు, ప్రయోగ విధానములు, బొమ్మలు గీయటం, వివిధ సమస్యలు, ప్రాజెక్టు పనులు, పరికల్పనలు మొదలైన అంశములను వ్రాయడానికి ప్రోత్సహించాలి.

**(ఆ) సంఘటన రచన (అనెక్డోటల్ రికార్డ్)**

విద్యార్థి తనకెదురైన ఒక సంఘటనను లేదా సన్నివేశాన్ని గురించి రాయడానికి ఉద్దేశించిన రికార్డును సంఘటన రచన లేదా అనగ్డోటల్ రికార్డ్ అంటారు. Anecdote అనగా ఒక ప్రత్యేక సంఘటనను గురించి సంక్షిప్తంగా రాయడం.

కొన్ని సందర్భాలలో పిల్లలు పెద్దవారిని ఆశ్చర్యపర్చే తీరులో ప్రవర్తిస్తారు. ఒక అంశం పట్ల పిల్లలు ధనాత్మకంగా లేదా ఋణాత్మకంగా ప్రతిస్పందించే తీరును పరిశీలించడాననికి ఇది ఉపయోగపడుతుంది.

- పిల్లల విశేష ప్రతిభను కనబర్చే సంభాషణ లేదా సందర్భం గురించి రాయడం.

**(ఇ) పోర్ట్‌ఫోలియో (Portfolio):**

- విద్యార్థులు చేసిన కృత్యాలను సేకరించిన వాటిని ప్రదర్శనలను, పనితీరు వివరాలను సంకలనం చేసి భద్రపరచడమే portfolio. వివిధ స్థాయిలలో వారు రాసిన వాటిని ప్రదర్శించవచ్చు. వీటిని వ్యక్తిగత portfolio అంటారు.
- ప్రత్యేక సంఘటనలను, విశేష ప్రతిభ కనబరిచినప్పుడు ఆ ఆధార పత్రాలను భద్రపరచవచ్చు.
- పిల్లలు రాసిన గేయాలు, కథలు, పాడించిన గేయాలు, గీసిన చిత్రాలు, ఉత్తరాలు మొదలైనవి.

**(ఈ) పాఠ్యపుస్తకాలలోని ప్రశ్నలు, అభ్యాసాలు:**

నిర్మాణాత్మక అభ్యసన సన్నివేశాలలో పాల్గొంటూ సామర్థ్యాలను సాధించడానికి అనుకూలంగా పాఠ్యపుస్తకాలు రూపొందాయి. కాబట్టి పిల్లలు పాఠ్యపుస్తకాలలో కూడా చాలా అంశాలను చర్చించడం మరియు రాయవలసి ఉంటుంది. పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే ప్రశ్నలకు సమాధానాలు, కృత్యాలులోని పట్టికలు నింపడం, సమాచార సేకరణ పట్టికలు నింపడం, అవసరమైన నివేదిక రాయడం మొదలైనవన్నీ పాఠ్యపుస్తకాలలో రాయవలసి ఉంటుంది. పాఠ్య బోధన, చర్చల సందర్భంలోను మరియు పాఠ్యపుస్తకాలలో పిల్లలు రాసిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకొని వారి ప్రగతిని అంచనా వేయాలి.

**(ఉ) పిల్లల డైరీ**

పిల్లల దినచర్య వారి స్పందనలు, చూసిన విన్న ఘటనల అనుభూతులు, అనుభవాలు మొదలైన వాటిని పొందుపరచి రాసినదే పిల్లల డైరీ.

పిల్లల డైరీ ద్వారా భాషా సామర్థ్యాలు, వారి నిజాయితీ, అభిరుచులు, ఆసక్తులు, భాషను ఉపయోగించు తీరు తెలుసుకోవచ్చు.

## 3. ప్రాజెక్టు పనులు

తరగతి గదిలో కేవలం వినడం ద్వారా లేదా చదవడం ద్వారా నేర్చుకోవడం అని కాకుండా చేయడం ద్వారా, అనుభవం ద్వారా నేర్చుకోవడానికి అవకాశం కల్పించే కార్యక్రమమే ప్రాజెక్టుపనులు. దీనిద్వారా పిల్లల్లో పరిశీలన, ప్రయోగ నైపుణ్యాలు అభివృద్ధిచెందుతాయి. ఉత్సాహంగా బోధనాభ్యసన ప్రక్రియలలో పాల్గొనగలుగుతారు. భాషలు, భాషేతర అంశాలలో పిల్లలు సొంతంగా జ్ఞానాన్ని పొందడానికి ప్రాజెక్టు పనులు ఎంతగానో ఉపయోగపడతాయి. పిల్లలు ప్రాజెక్టులో పాల్గొన్న విధానాన్ని, రూపొందించిన నివేదికలను ఆధారంగా చేసుకొని మూల్యాంకనం చేయాలి.

"ఇచ్చిన ఒక అంశం మీద విద్యార్థి/ విద్యార్థులు కూలంకషంగా చర్చించి ఆ సమస్యను వివిధ కోణాలలో విశ్లేషించి, పరిశీలించి ఒక నివేదికను సమర్పించడం".

ఇది కొంతమంది విద్యార్థులకు జట్టు కృత్యంగా కూడా నిర్వహించవచ్చును. ఈ విధానం వలన విద్యార్థిలో స్వయం అభ్యసనం, తాను తెలుసుకున్న అంశాల మీద నిజనిర్ధారణ, కొత్త విషయాలను సేకరించడం, నమూనాలను తయారుచేయడం, సమస్యను విశ్లేషించడం, ఇతరులతో మాట్లాడడం మొదలైన గుణాలు అలవడతాయి.

ఉదా: 5వ తరగతి విద్యార్థులకు మార్కెట్‌లో లభించే వివిధ రకాల కూరగాయల ధరలు గురంచి ఒక నివేదిక తయారుచేయుట.

కూరగాయల ధరలు రోజురోజుకి మారుతున్నాయా? లేదా అనే అంశంమీద పరిశీలన చేయమనుట. ఈ విషయంలో సమాచారం సేకరించడం కోసం విద్యార్థులు కింది పనులను చేయడం ద్వారా ప్రాజెక్టును పూర్తిచేస్తారు.

1. కూరగాయల ధరలు సేకరించుట
2. ఒక వారం రోజులపాటు వీటిని సేకరించడం
3. ప్రతిరోజు మార్కెట్‌ను సందర్శిస్తారు.
4. వివిధ రకాల కూరగాయల ధరలను తెలుసుకొనుట, పట్టికలో నమోదుచేసుకొనుట చేస్తారు.
5. ఈ ధరలు తదుపరి రోజు ధరలకు తేడాలను గుర్తించి పోల్చుకుంటాడు.
6. ఏ ధరలు నిలకడగా వున్నాయి? ఏ ధరలు నిలకడగా లేవు అనే విషయాలు చర్చించుకుంటారు.
7. నివేదికను సమర్పించడం, వాటిపై చర్చలు నిర్వహించడం.
8. గణితం, సామాన్యశాస్త్రం, భాషలో నేర్చుకొన్న అంశాలు అన్నీ విద్యార్థి ఉపయోగించుకోగలుగుతాడు.

**నివేదిక రూపకల్పన (Documentation):**

పిల్లలు తాము సేకరించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని నివేదికను తయారుచేస్తారు. పిల్లలు నిర్వహించే కార్యక్రమాలను క్రమపద్ధతిలో రాసి ఇవ్వగలిగితే అది నివేదిక అవుతుంది. ప్రాజెక్టు పనులు, సమాచార సేకరణ మొదలగు వాటిని ఒక రిపోర్ట్ రూపంలో రాయడాన్ని డాక్టుమెంటేషన్ లేదా నివేదిక రూపకల్పన అంటారు. ఈ పనులలో వారు నిర్వహించిన తీరు, సేకరించిన సమాచారం రాయాలి.

జాతీయపండుగలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించినపుడు దానిని పేపరుపై క్రమపద్ధతిలో రాయగలుగుతాడు. ఆరోజు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించారో పొందుపరుస్తారు. వివిధ సందర్భాలలో జరిగే కార్యక్రమాలను విషయాల వారీగా ఉంచుతారు. ప్రతి విషయాన్ని రాతపూర్వకంగా చూపించడానికి ప్రయత్నిస్తారు. సన్నివేశాలను వివరిస్తారు. మంచి మాటలను గుర్తించి రాయగలుగుతారు. ఉత్తమమైన దానిని గుర్తించి రాయగలుగుతారు. క్షేత్రప్రదర్శనల వివరాలను రాయగల్గుతారు. విజ్ఞాన, విహారయాత్రలకు వెళ్ళినప్పుడు చూసిన ప్రదేశాలు, జరిగిన సంఘటనలు మొదలగునవి రాసి ఇవ్వగల్గుతారు. ఈ నివేదికలో సమాచారం, అభిప్రాయాలు, ప్రత్యేకాంశాలతోబాటు ఫోటోలను జతచేయాలి. ప్రత్యేకాంశాలను బాక్సుల రూపంలో పొందుపర్చాలి.

### 4. లఘు పరీక్ష (Slip Test):

నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల సామర్థ్యాల సాధనను ఒక చిన్న పరీక్ష రూపంలో కూడా పరిశీలించవలసి ఉంటుంది. అయితే, ఇది సాధారణ యూనిట్ పరీక్ష కాదు. దీని గురించి ముందుగానే ప్రశ్నాపత్రం రూపొందించుకోవడం, పరీక్షల టైమ్ టేబుల్ ప్రకటించడం, నిర్ణీత సమయంలోనే పరీక్షను నిర్వహించడం వంటివి ఉండవు. ఉపాధ్యాయుడు తాను చెప్పిన పాఠ్యాంశాలలో ఎంపిక చేసుకున్న విద్యా ప్రమాణాలను పరిశీలించడానికి అప్పటికప్పుడే నిర్వహించే ఒక రాత పరీక్ష. దీని ద్వారా పిల్లల సామర్థ్యాల సాధనను ఉపాధ్యాయుడు నిర్ధారించడానికి వీలు కలుగుతుంది. దీనిపై ఎలాంటి ముందస్తు సమాచారం విద్యార్థులకు ఇవ్వనవసరం లేదు. ప్రశ్నలను నల్లబల్లపై గాని, చార్టుపై గాని రాయాలి. పుస్తకంలో ఉన్న ప్రశ్నలను, అభ్యాసాలను అలాగే ఇవ్వకూడదు. పిల్లలు ఆలోచించి సొంతంగా సమాధానాలు రాసేందుకు వీలుగా ప్రశ్నలు తయారుచేసి ఇవ్వాలి.

**గ్రేడింగ్ విధానం:** పిల్లలలో మార్కులు, ర్యాంకులకోసం జరిగే అనారోగ్యకర పోటిని నిరోధించడానికి ప్రభుత్వం నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా గ్రేడింగ్ పద్ధతిని అమలుచేస్తోంది. ఫార్మాటివ్, సమ్మేటివ్ మూల్యాంకనంలో పిల్లలు సాధించిన మార్కుల ఆధారంగా వారి ప్రగతిని 5 పాయింట్ల స్కేలులో మాపనం చేస్తాయి. $A^+$,A,$B^+$,B,C గ్రేడులుగా పిల్లల ప్రగతిని నిర్ధారిస్తారు. పిల్లల ప్రగతిని సామర్థ్యాల వారీగా పరిశీలించడం, నమోదుచేయడం, పిల్లల అభ్యసనాన్ని మెరుగు పరుచుకునేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

**నిర్మాణాత్మక మూల్యాంకనం**

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో నిర్మాణాత్మక మూల్యాంకనం అత్యంత కీలకమైనది. నిర్మాణాత్మక మూల్యాంకనం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించే పరీక్ష కాదు. ఇది పిల్లలకు తెలియకుండానే బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించే క్రమంలోనే పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించే పద్ధతి. అభ్యసనం జరిగేటప్పుడు విద్యార్థి ఎలా నేర్చుకొంటున్నాడు? ఎక్కడెక్కడ తప్పులు చేస్తున్నాడు? తెలుసుకుని తన బోధనను మార్చుకుని విద్యార్థికి తగిన విధంగా సహాయ సహకారాలు అందించి మెరుగుపరచాలి. పరిశీలించిన ప్రగతిని గ్రేడు రూపంలో నమోదు చేసి విద్యార్థి సామర్థ్యాలను అభివృద్ధిపరుచుటకు ఉపయోగపడుతుంది.

నిర్మాణాత్మక మూల్యాంకనంలో నాలుగు సాధనాలు ఉంటాయి. వాటికి కేటాయించిన మార్కులను పరిశీలిద్దాం.

1. పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు - 10 మార్కులు
2. రాసిన అంశాలు - 10 మార్కులు
3. ప్రాజెక్టు పనులు - 10 మార్కులు
4. లఘు పరీక్ష (slip test) – 20 మార్కులు

## 1. పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు:

ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠ్యబోధనా సమయంలో గాని వివిధ సందర్భాలలో గాని పిల్లలను పరిశీలించాలి. పరిశీలన ద్వారా వారికి వివిధ అంశాలలో గ్రేడు ఇవ్వాలి. సబ్జక్టు వారీగా పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు పరిశీలించాల్సిన అంశాలను పరిశీలిద్దాం!

***(అ) తెలుగు***

- పాఠ్యబోధనా సమయంలో పిల్లలు మాట్లాడడం పరిశీలించాలి.
- వారికి సందేహం వచ్చినపుడు ప్రశ్నిస్తున్నారా? లేదా ప్రశ్నించే విధానం పరిశీలించాలి.
- చర్చలో పాల్గొంటూ వారి భావాలను వ్యక్తీకరించే తీరును పరిశీలించాలి.
- అభినయ గేయాలు పాడడం, ఏదైనా ఒక అంశం గురించి మాట్లాడడం (ఉపన్యసించడం).
- జట్టు పనుల్లో పాల్గొనే విధానం పరిశీలించాలి.
- ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలకు పిల్లలు జవాబులు ఇచ్చే తీరు.
- చర్చల్లో పిల్లలు పాల్గొనేతీరు.
- పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే అభ్యాసాలకు సమాధానాలు తెలుసుకోవడం గురించి చర్చల్లో పాల్గొనేతీరు.

- భాషా కార్యకలాపాల్లో పాల్గొనడం
- నాటకీకరణ, ఏకపాత్రాభినయం, మూకాభినయం, పద్యాలపోటీలు, వక్తృత్వ పోటీలు, వ్యాస రచన పోటీలు, మేళాలు మొదలగు కార్యకలాపాల్లో పాల్గొనడం
- పుస్తక పఠనం చేయడం, దానిని గురించి మాట్లాడడం, సమీక్షల్లో చురుకుగా పాల్గొనడం అనగా చదివిన పుస్తకం గురించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో చురుకుగా పాల్గొనాలి.

*(ఆ) గణితం:*

- గణిత భావనలను వ్యక్తపరిచే విధానం ప్రతిచర్యలో పాల్గొనే విధం పరిశీలించాలి.
- సమస్యా సాధనలో తగిన కారణాలను ఆలోచించి వివరించగలగడం పరిశీలించాలి.
- ప్రశ్నించడం, అడిగిన ప్రశ్నలకు ప్రతిస్పందించడం, సమాధానాలివ్వడం పరిశీలించాలి.
- నల్లబల్ల పై సమస్యా సాధన చేసి వివరించడం పరిశీలించాలి.
- జట్టు మరియు వ్యక్తిగత కృత్యాల్లో పాల్గొనే విధం
- ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలకు పిల్లలు జవాబులు ఇచ్చే తీరు.
- చర్చలలో పిల్లలు పాల్గొనేతీరు.
- పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే అభ్యాసాలకు సమాధానాలు తెలుసుకోవడం గురించి చర్చల్లో పాల్గొనేతీరు.
- మనోగణిత సమస్యలగురించి ప్రతిస్పందించడం, గణిత ప్రాజక్టుపనుల్లో పాల్గొనడం మొదలగునవి.

*(ఇ) పరిసరాల విజ్ఞానం:*

- తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియల సమయంలో పిల్లలు మాట్లాడడం ప్రశ్నించడం పరిశీలించాలి.
- పాఠంలోని పట్టికలు నింపడం, ప్రతిచర్యలు గమనించడం.
- విషయాలకు స్థానిక అంశాలు జోడించడం, అనుభవాలు పంచుకోవడం పరిశీలించాలి.
- పటాన్ని పరిశీలించడం, వివరించడం పరిశీలించాలి. బొమ్మలు గీయడం, నమూనాలు తయారు చేయడంలో పాల్గొనే విధానం పరిశీలించాలి.
- జట్టు పనుల్లో పాల్గొనే విధం పరిశీలించాలి.
- ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలకు పిల్లలు జవాబులు ఇచ్చే తీరు.
- చర్చాంశాలపై పిల్లలు పాల్గొనేతీరు.
- పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే అభ్యాసాలకు సమాధానాలు తెలుసుకోవడం గురించి చర్చల్లో పాల్గొనే తీరు.
- సమాచారాన్ని సేకరించడం, సేకరించిన సమాచారాన్ని వివరించడం, తమ అభిప్రాయాలు చెప్పడం.

*(ఈ) సామాన్యశాస్త్రం:*

- పిల్లలు ప్రయోగాలు నిర్వహించేటప్పుడు పాల్గొనే తీరును పరిశీలించాలి.
- తరగతి గదిలో సందేహం వచ్చినపుడు ప్రశ్నించడం (పాఠశాలలో మొక్కలు, జంతువుల పట్ల దయను కలిగి ఉండడం).

- వివిధ వస్తువుల సేకరణలో, దత్తాంశ సేకరణలో పాల్గొనే విధానాన్ని పరిశీలించడం.
- బొమ్మలు గీయడం, నమూనాలు తయారు చేయడంలో పాల్గొనే విధానాన్ని పరిశీలించాలి.
- ప్రాజెక్టు పనుల నిర్వహణలో జట్టులో పాల్గొనే విధానాన్ని పరిశీలించాలి.
- ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలకు పిల్లలు జవాబులు ఇచ్చే తీరు.
- చర్చాంశాలపై పిల్లలు పాల్గొనేతీరు.
- పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే అభ్యాసాలకు సమాధానాలు తెలుసుకోవడం గురించి చర్చల్లో పాల్గొనేతీరు.
- పరికల్పనలు చేయడం, ప్రశ్నించడం, ప్రయోగాల గురించి వివరించడం, నమూనాలు, చిత్రాల ఆధారంగా మాట్లాడేతీరు.

***(ఉ) సాంఘిక శాస్త్రం:***

- తరగతిలో బోధనాభ్యాసన ప్రక్రియ జరుగుతున్నపుడు పిల్లలు ప్రశ్నించడం, మాట్లాడడం, వ్యాఖ్యానించడం పరిశీలించాలి.
- పటాన్ని పరిశీలించడం, వివరించడం పరిశీలించాలి.
- విషయాలకు స్థానిక అంశాలు జోడించడం, అనుభవాలు పంచుకోవడం లాంటివి పరిశీలించాలి.
- సమస్యల పట్ల ప్రతిస్పందించడం, ప్రశంసించడం లాంటివి చేస్తున్నారా అనేది ప్రశ్నించాలి.
- పిల్లలు జట్లలో పాల్గొనే విధం పరిశీలించాలి.
- ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలకు పిల్లలు జవాబులు ఇచ్చే తీరు.
- చర్చాంశాలపై పిల్లలు పాల్గొనేతీరు.
- పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే అభ్యాసాలకు సమాధానాలు తెలుసుకోవడం గురించి చర్చల్లో పాల్గొనేతీరు.

***(ఊ) ఆంగ్లం***

- Listening & Responding in various contexts of classroom interaction; nature of responses; as per the context.
- Reading comprehension - to the given pictures; graphs; known text and new text.
- Oral discourses - to assess the children performance on the basis of the presenation of the targetted discourses by following the indicators. In lower classes children performance can be assessed on the basis of construction of action rhymes, roleplay/ conversation and responding to simple classroom instructions.
- Written discourses - to assess the children performance on the basis of the presenation of the targetted discourses by following the indicators.
- Vocabulary - The ability to use appropriate vocabulary in the given context.

## 2. సబ్జెక్టు వారీగా రాసిన అంశాలు:

పిల్లల నోటు పుస్తకాలు, ఇంటిపని పుస్తకాలు, పాఠ్యపుస్తకాలలో రాసిన అంశాలను దిద్దడం, సూచనలివ్వడం.

*(అ) తెలుగు*

- పాఠ్యపుస్తకంలోని ఇవి చేయండి అభ్యాసాలు సాధించి / పూర్తి చేసి ఉండాలి.
- పాఠ్యపుస్తకంలోనే రాయాల్సిన అభ్యాసాలను పిల్లలు సొంతంగా రాయడం.
- పాఠం పూర్తి కాగానే పిల్లలు 'ఇవి చేయండి' లోని అభ్యాసాలను సొంతంగా నోటుపుస్తకంలో రాయాలి. గైడ్లు, స్టడీ మెటీరియల్ వంటి వాటిలో చూసి రాయకూడదు.
- గోడ పత్రికకై, పోర్ట్ ఫోలియోకై సేకరించే అంశాలు లేదా స్వయంంగా రాసి/ తయారు చేసి ప్రదర్శించే అంశాలు.
- సృజనాత్మకత, ప్రశంసకు సంబంధించిన అభ్యాసాలను రాయడం, చిత్రాలు సేకరించడం, గీయడం చేసి వాటి గురించి రాయడం.
- విద్యార్థి డైరీ/ (సూక్తులు/ నీతివాక్యాలు)/ వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన నినాదాలు రాయడం.
- పాఠం మధ్యలో, చివర ఇచ్చిన ప్రశ్నలకు, అభ్యాసాలకు సొంతంగా సమాధానాలు రాయడం.
- పిల్లలు తాము చదివిన కథలు, పాటలు, గేయాలు, వార్తలు మొదలగు వాటి గురించి డైరీలో రాయడం.
- ప్రాజక్టు పని నివేదికలు రాయడం మొదలగునవి.

*(ఆ) గణితం:*

- పాఠ్యపుస్తకంలో అభ్యసన కృత్యాలు, అభ్యాసాలలో (ఇవి చేయండి, ప్రయత్నించండి మొదలగునవి) పాఠ్యపుస్తకంలోనే రాయవలసి ఉన్న చోట పిల్లలు తామే సొంతంగా చేయడం.
- పిల్లల ఇంటి పని నోటుపుస్తకాలలో లెక్కలు చేసిన విధం.
- తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తున్న సమయంలో పిల్లల ప్రతిస్పందనలు, సొంతంగా చేసే అంశాలు. జట్టు పనుల్లో పాల్గొన్న తీరు మొదలగునవి.
- పిల్లల పోర్ట్‌ఫోలియోలు, గోడ పత్రికకై స్వయంగా రూపొందించి ప్రదర్శించే గణితపరమైన అంశాలు.
- పాఠం మధ్యలో, చివర ఇచ్చిన సమస్యలు, అభ్యాసాలకు సొంతంగా సమాధానాలు రాయడం.

*(ఇ) పరిసరాల విజ్ఞానం:*

- పాఠ్యపుస్తకంలోని అభ్యాస కృత్యాలు, పట్టికలు పూర్తి చేసి ఉండడం.
- పాఠం మధ్యలో ఇచ్చిన ప్రశ్నలకు సొంతంగా సమాధానాలు రాయడం.
- సేకరించిన వివిధ సమాచార పట్టికలు వాటి గురించిన వివరాలు రాయబడి ఉండడం.
- బొమ్మలు గీయడం, భాగాలు గుర్తించడం, పటంలో ప్రాంతాలు గుర్తించడం, పటాలు గీయడం.

- మనం ఏం నేర్చుకున్నాం అనే అభ్యాసాలు నోటు పుస్తకాలలో సొంతంగా రాసి ఉండడం.
- పిల్లల  పోర్టుఫోలియోలు, గోడపత్రికలో పరిసరాల విజ్ఞానంకు సంబంధించిన అంశాలు ఉండడం.
- పాఠం మధ్యలో, చివర ఇచ్చిన ప్రశ్నలకు, అభ్యాసాలకు సొంతంగా సమాధానాలు రాయడం.

***(ఈ) సామాన్యశాస్త్రం:***

- పాఠ్యపుస్తకంలోని అభ్యాసన కృత్యాలు, పట్టికలు నింపబడి ఉండడం.
- పాఠంలోని భావనల ఆధారంగా బొమ్మలను గీయడం, గోడపత్రికలో ప్రదర్శింపబడడం.
- మనం ఏం నేర్చుకున్నాం అనే అభ్యాస కృత్యానికి సమాధానాలు సొంతంగా రాసి ఉండడం.
- వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన నినాదాలు రాయడం ప్రదర్శించడం.
- సేకరించిన వివిధ సమాచార పట్టికలు వాటి గురించి వివరణలు నోటు పుస్తకంలో రాసి ఉండడం.
- పాఠం మధ్యలో, చివర ఇచ్చిన ప్రశ్నలకు, అభ్యాసాలకు సొంతంగా సమాధానాలు రాయడం.

***(ఉ) సాంఘిక శాస్త్రం:***

- నోటు పుస్తకాలలో విషయాల వారిగా పూర్తి చేసి ఉండడం.
- సమాచార పట్టికలు పూర్తి చేయడం.
- పాఠ్యపుస్తకాలలోని అభ్యాసాలను పూర్తి చేయడం.
- పటాలను, ప్రదేశాలను గుర్తించడం, ఔట్‌లైన్ మ్యాపులు గీయడం.
- పిల్లల పోర్ట్‌ఫోలియోలు, గోడపత్రికలలో సాంఘికశాస్త్ర అంశాలు ఉండడం.
- పాఠం మధ్యలో, చివర ఇచ్చిన ప్రశ్నలకు, అభ్యాసాలకు సొంతంగా సమాధానాలు రాయడం. గైడులు , స్టడీ మెటీరియల్స్ చూసి జవాబు రాయకూడదు.

***(ఊ) ఆంగ్లం:***

- Textual exercises.
- Written discourses.
- Home work note books.
- Students diaries
- Collections/ written disccourses preserved in portfolios/ children products to the wall magazine.

## 3. ప్రాజెక్టు పనులు:

పాఠ్య పుస్తకంలో ప్రతి పాటంలో ప్రాజక్టు పనులున్నాయి. వీటిని పిల్లలతో చేయించాలి. నివేదికలు రాయించాలి.ప్రదర్శన చేయించి చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.ప్రాజెక్టు జట్టుపనిగా మాత్రమే ఇవ్వాలి.

*(అ) తెలుగు*

- ప్రాజెక్టు కొరకు ప్రణాళికను రూపొందించుకోవడం
- ఇవ్వబడిన ప్రాజెక్టుకు సమాచార సేకరణ
- సేకరించిన సమాచారాన్ని క్రమపద్ధతిలో అమర్చడం.
- ఇచ్చిన ప్రాజెక్టును తరగతిలో ప్రదర్శించి దాని గురించి మాట్లాడడం.
- నివేదిక తయారు చేసి సమర్పించడం

*(ఆ) గణితం:*

- ప్రణాళిక రూపకల్పన
- ఇవ్వబడిన ప్రాజెక్టు పని సంబంధించిన సమాచారాన్ని సేకరించిన విధము / పద్ధతి
- సేకరించిన సమాచారాన్ని నమోదు చేసిన విధము
- నమోదు చేసిన సమాచారాన్ని విశ్లేషించి వివరించడం, ప్రదర్శించడం
- నివేదిక రూపొందించడం

*(ఇ) పరిసరాల విజ్ఞానం:*

- ముందుగా ప్రణాళిక తయారుచేయడం
- ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం
- సేకరించిన సమాచారాన్ని క్రమపద్ధతిలో నమోదు చేయడం
- నమోదు చేసిన సమాచారాన్ని ప్రదర్శించడం, విశ్లేషించడం, వివరించడం
- నివేదిక తయారు చేసి సమర్పించడం.

*(ఈ) సామాన్య శాస్త్రం:*

- ప్రణాళిక రూపకప్పన
- సేకరించిన సమాచారాన్ని క్రమపద్ధతిలో నమోదు చేయడం
- నమోదు చేసిన సమాచారాన్ని ప్రదర్శించడం, విశ్లేషించడం, వివరించడం
- నివేదిక తయారు చేసి సమర్పించడం.

*(ఉ) సాంఘిక శాస్త్రం:*

- ప్రణాళిక రూపకప్పన
- ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం
- సేకరించిన సమాచారాన్ని క్రమపద్ధతిలో నమోదు చేయడం
- నమోదు చేసిన సమాచారాన్ని ప్రదర్శించడం, విశ్లేషించడం, వివరించడం
- నివేదిక తయారు చేసి సమర్పించడం.

*(ఊ) ఆంగ్లం:*

- Planning for the project
- Execuation
- Analysis of the information
- Report writing
- Presentation

## 4. లఘు పరీక్ష:

- ఇది సాధారణంగా పెట్టే యూనిట్ పరిక్ష కాదు. ఈ పరీక్ష యూనిట్ టెస్టులా కాకుండా/ ముందస్తు సమాచారం ఇవ్వకుండా అప్పటికప్పుడు తమ పీరియడ్‌లోనే నిర్వహించాలి.
- రాత పరీక్ష 20 మార్కులకు నిర్వహించాలి.
- దీనికి నిర్దిష్ట సమయం అవసరం లేదు. ఎప్పుడైనా నిర్వహించుకోవచ్చు.
- ఈ పరీక్షకు ప్రత్యేకంగా ఒక నోటు పుస్తకం కేటాయించి దానిలోనే సమాధానాలు రాయమనాలి.
- రాత పరీక్షకు 20 మార్కులు ఉన్నాయి కాబట్టి ప్రతి సబ్జెక్టులో ఏవైనా 2 లేదా 3 సామర్థ్యాల కనుగుణంగా ప్రశ్నా పత్రాన్ని ఉపాధ్యాయులే తయారు చేసుకొని మూల్యాంకనం చేయాలి. ప్రశ్నలను నల్లబల్లపై రాసి లఘు పరీక్షను నిర్వహించాలి.
- దీన్ని నిర్వహించడంలో ఉపాధ్యాయులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

  నోటు పుస్తకాలలోని సమాధానాలను దిద్ది పొందిన మార్కుల ఆధారంగా గ్రేడును ఇవ్వాలి. ఒక్కసారే అన్ని రకాల సాధనాలు పరీక్షించాల్సిన అవసరం లేదు. ప్రతి రోజు చేసే పరిశీలనల ఆధారంగా ఒక అంచనాకు వచ్చి విద్యార్థి ప్రగతిని మూల్యాంకనం చేయాలి. దాని ఆధారంగా మార్కులు ఇవ్వాలి. నిర్మాణాత్మక మూల్యాంకనంలో ఉన్న నాలుగు మూల్యాంకన సాధనాలకు మార్కులు ఇవ్వాలి. మొత్తం మార్కుల ఆధారంగా గ్రేడును నిర్ధారించాలి.

**సంగ్రహణాత్మక మూల్యాంకనం :**

సంగ్రహణాత్మక మూల్యాంకనం అనగా కొంత కాలంలో (పీరియడ్‌లో) నిర్దేశించిన పాఠ్యాంశాలలో పిల్లలు ఏమేరకు విద్యాప్రమాణాలు సాధించారో తెలుసుకొనుటకు ఉద్దేశించబడినది. సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహించే సమయాన్ని, తేదిని పిల్లలకు ముందే తెలియజేస్తారు. ఇందుకోసం సంగ్రహణాత్మక మూల్యాంకనం నాటికి అయిన అన్ని పాఠ్యాంశాలలో రాతపరీక్షను నిర్దేశించిన సమయంలో రెండున్నర గంటలపాటు నిర్వహిస్తారు.

- గ్రేడు నిర్ణయించడంలో విద్యార్థి సాధించిన మార్కులను దృష్టిలో ఉంచుకోవాలి. కింది పట్టిక ఆధారంగా మార్కుల శాతాన్నిబట్టి గ్రేడునివ్వాలి.

| శాతం | గ్రేడు |
|---|---|
| 91-100 | $A^+$ |
| 71-90 | A |
| 51-70 | $B^+$ |
| 41-50 | B |
| 0-40 | C |

**నిర్మాణాత్మక మూల్యాంకనంలో గ్రేడును నిర్ధారించడం:**

ఒక విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు నిర్వహించే నిర్మాణాత్మక మూల్యాంకనంలో కూడా సంగ్రహణాత్మక మూల్యాంకనంలో మాదిరిగానే మార్కుల ఆధారంగా గ్రేడును నిర్ధారించాలి. ఒక విద్యార్థి నిర్మాణాత్మక మూల్యాంకనంలోని నాలుగు సాధనాలలో పొందిన మార్కుల ఆధారంగా గ్రేడును ఇవ్వాలి. కింది ఉదాహరణను పరిశీలించండి.

రవి నాలుగో తరగతి చదువుతున్నాడు. సెప్టెంబర్ నెలలో నిర్వహించిన రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనంలో నాలుగు సాధనాలలో పొందిన మార్కులు ఇలా ఉన్నాయి.

| విషయం | నిర్మాణాత్మక మూల్యాంకనం - 2 | | | | పొందిన మార్కులు | గ్రేడు |
|---|---|---|---|---|---|---|
| | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (10 మా) | రాత అంశాలు (10 మా) | ప్రాజెక్టు పనులు (10 మా) | లఘు పరీక్ష (20 మా) | | |
| తెలుగు | 8 | 7 | 9 | 16 | 40 | ఎ |

- రవి తెలుగులో రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనంలో నాలుగు సాధనాలలో కలిపి మొత్తం 40 మార్కులు పొందాడు. గ్రేడు సూచిక ప్రకారం 70 నుండి 90% మార్కులు సాధించిన వారు 'ఎ' గ్రేడులో ఉంటారు. కాబట్టి, రవి 'ఎ' గ్రేడు పొందినట్లుగా ఉపాధ్యాయుడు నిర్ధారించాడు.

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో పిల్లల ప్రగతిని నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాల ద్వారా నిర్ధారించి పిల్లల ప్రగతిని ప్రగతి నమోదు రిజిష్టర్ (సి.సి.ఇ. రిజిష్టర్)లో నమోదు చేయాలి. ఉపాధ్యాయుడు పాఠశాల రిజిష్టర్‌లో పిల్లలు సాధించిన (సి.సి.ఇ. రిజిష్టర్) మార్కులు, గ్రేడులను నమోదు చేసుకోవాలి. సంవత్సరాంతంలో సమగ్ర ప్రగతి నమోదు (కన్సాలిడేటెడ్ రిపోర్ట్)ను పై అధికారులకు అందజేసే సందర్భంలో తరగతివారీగా తరువాతి తరగతికి వెళ్ళిన, వెళ్ళని పిల్లల వివరాల నివేదికను ఇవ్వాలి.